క్లుప్తంగా

వసంతోత్సవానికి తరలిరండి..


ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: సీతంపేటలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీన జరిగే వసంతోత్సవానికి అందరూ తరలిరావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం కోరారు. టీటీడీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం 5 వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో మొత్తం 100 దేవాలయాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈకేవైసీ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి

కురుపాం: ఈకేవైసీ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఉప ఖజానా కార్యాలయం అధికారి కె.శంకరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన వారంతా కురుపాం ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పెన్షనర్లంతా స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో, గుమ్మలక్ష్మీపురం ప్రాంతం వారు అక్కడి వర్తక సంఘం భవనంలో, జియ్యమ్మవలస ప్రాంత వాసులు ఎంపీడీఓ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

జోరుగా పెన్షన్ల పంపిణీ


భామిని: బత్తిలిలో దివ్యాంగురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సామాజిక పెన్షన్ల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. సోమవారం వేకుజాము నుంచే లబ్ధిదారుల ఇంటింటికీ వలంటర్లు వెళ్లి, బయోమెట్రిక్ తీసుకుని, పెన్షన్ నగదు అందజేశారు. మొత్తం 16 సచివాలయాల పరిధిలో 525 మంది వలంటీర్లు పాల్గొని, పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు తెలిపారు.

పాలకొండ రూరల్: మండలంలోని 32 పంచాయతీల్లో 10,404 మందికి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, పెన్షన్లు అందజేశారు. ఒకటో తేదీనే పెన్షన్ నగదు అందుతుండడంతో లబ్ధిదారులు ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు దాదాపు 91 శాతం మేర పెన్షన్ల పంపిణీ చేపట్టినట్లు ఎంపీడీఓ డొంక త్రినాధులు తెలిపారు.

మహిళా మార్టుల ఏర్పాటుకు ప్రాధాన్యం

సీతానగరం: పొదుపుసంఘ సభ్యుల భాగస్వామ్యంతో మండల కేంద్రంలో అధిక మొత్తంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. ఈ మేరకు మహిళా మార్టుల ఏర్పాటుపై సీసీలు, సిబ్బందితో మండల వెలుగు కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యంతో నిర్వహించే మహిళా మార్ట్‌కు ముందుగా సభ్యుల వాటాధనంగా రూ.200 చెల్లించాలని, 400 మంది సభ్యులు ఇప్పటికి షేర్‌ధనం కట్టినట్లు తెలియజేశారు. ఈ క్రమంలో మండలకేంద్రంలో నాణ్యమైన సరుకు, తక్కువ ధరకు, ఆరోగ్యకరమైన సరుకులు, పొదుపు సంఘం సభ్యుల ఆధ్వర్యంలో విక్రయించడమే మార్టుల ముఖ్యఉద్దేశమన్నారు. మండలంలో 1561 పొదుపు సంఘాలుండగా 18,400 మంది సభ్యులున్నారని తెలియజేశారు. డీఆర్‌డీఏ పీడీ సూచనల మేరకు అర్హులైన వారందరూ వ్యాపారాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దాడితల్లి సిరిమానోత్సవం


అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పిస్తున్న పూజారులు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు, దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. బొబ్బిలి, గొల్లపల్లితో పాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు దాడితల్లి పండుగను జరుపుకుంటారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు పూజారి బత్తిన సూరిబాబు సిరిమానును అధిరోహిస్తారు. అక్కడి నుంచి గొల్లపల్లి, మార్కెట్ మీదుగా బొబ్బిలి పురవీధుల్లో సిరిమాను ఊరేగుతుంది. తిరిగి తెల్లవారు జామున గొల్లపల్లి చేరుకుంటుంది. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సిరిమాను తిరిగే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలూ లేకుండా ఉండేలా సిబ్బందితో కలసి పర్యటించారు.

ఘనంగా తొల్లేళ్ల ఉత్సవం

దాడితల్లి అమ్మవారి పండుగలో భాగంగా సోమవారం తొల్లేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరెలు సమర్పించారు. భక్తులు ఘటాల వెంట తిరుగుతూ సందడి చేశారు.


వీరఘట్టం: అమ్మవారికి మొక్కు సమర్పించి, దండకం చదవుతున్న బోయిడు


వీరఘట్టం: వనంగుడి నుంచి పైడితల్లి అమ్మవారిని తోడ్కొని వస్తున్న దృశ్యం


పాలకొండ రూరల్: అమ్మవారి ఘటాలతో వస్తున్న భక్తులు


పాలకొండ రూరల్: ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

పాలకొండ నియోజకవర్గంలోని పలుచోట్ల జరుగుతున్న గ్రామదేవతల ఉత్సవాలు, సంబరాలు, జాతరలు, పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ భగవన్నామస్మరణలో మునిగితేలుతున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పూజల్లో పాల్గొని, దైవానికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఎక్కడ చూసినా నెలకొన్న ఈ తరహా వాతావరణంతో పట్టణాలు, పల్లెల్లో పండగ సందడి నెలకొంది.

- వీరఘట్టంలో ఘనంగా పైడితల్లి ఉత్సవాల ప్రారంభం
- కొండాపురంలో కొనసాగుతున్న అసిరితల్లి జాతర మహోత్సవాలు
- పాలకొండలో వైభవంగా సనారి విశ్వనాథుని కల్యాణం
- పెద్దసంఖ్యలో భక్తులు, యాత్రికులు హాజరు


పాలకొండ రూరల్: ప్రేక్షకులను ఆద్యంతం అలరించిన డ్యాన్స్‌లు


పాలకొండ రూరల్: సనారి విశ్వనాథుని కల్యాణం జరిపిస్తున్న భక్తులు

వీరఘట్టం: పట్టణంలో పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత వనంగుడి నుంచి అమ్మవారిని ఊరేగింపుగా స్థానిక అమ్మవారి ఆలయం వద్దకు తీసుకువచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోయిడు(అమ్మవారి పూజారి) మహేష్ ఇంటి వద్దకు, అక్కడి నుంచి మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరి చెరువు దగ్గరున్న అమ్మవారి గుడి వద్దకు తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా బోయిడు అమ్మవారికి మూడు పసుపు ముద్దలు సమర్పించి, అమ్మవారి దండకం చదివి వినిపించారు. మముగన్న మాయమ్మ.. కాశీవిశాలాక్షమ్మ, కంచికామాక్షమ్మ, మధుర మీనాక్షమ్మ, మజ్జిగౌరమ్మ, మరిడి మారమ్మ, కోటదుర్గమ్మ, పైడితల్లమ్మా అని స్తుతించి, భక్తులను చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు. కొన్నిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలతో పండగ వాతావరణం నెలకొంది. అందరి ఇళ్లావాకిళ్లు చుట్టాలు, బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి. ప్రధాన రోడ్లు, అమ్మవారి ఆలయం విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోతున్నాయి. ఉత్సవాల తొలిపూజను ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ చేయగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

ఘటాల ఊరేగింపు..

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురం గ్రామంలో అసిరితల్లి గ్రామదేవత ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దాదాపు 6 దశాబ్దాల తర్వాత ఈ ఉత్సవాలు జరుగుతుండడంతో ఎక్కడెక్కడో స్థిరపడిన గ్రామస్తులంతా గ్రామానికి చేరుకోవడంతో పండగ సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ క్రమంలో చేపట్టిన తప్పెటగుళ్ల ప్రదర్శన, మహిళల కోలాటం, ఢీ షో బృందం చేసిన డ్యాన్స్‌లు అలరించాయి.

పాలకొండ రూరల్: స్థానిక కోమటిపేటలో శ్రీఅన్నపూర్ణ సహిత సనారి విశ్వనాథ అవదూత స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు ప్రసాద్ పాడి నేతృత్వంలో జరిగిన కల్యాణోత్సవాన్ని చూసి తరించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

జీడిమామిడి పంటకు మద్దతు ధర కల్పించండి

- జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ అడ్డాకుల చిన్నారావు


అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి పంటకు మద్దతు ధర కల్పించండి అని జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ అడ్డాకుల చిన్నారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలోని విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో జీడిపిక్కల రూ.110 గరిష్ట ధర అని, ఇప్పుడు రూ.90కు చేరుకుందన్నారు. దీంతో జీడిమామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, ఇతరత్రా పంటలకు మద్దతు ధర కల్పించినట్లే ఈ పంటకు కూడా మద్దతు ధర ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన వలరౌతు ప్రకాశరావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, బురుజోల సర్పంచ్ మడపాన కేశవ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహనబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాలుగా మార్చండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో ఉన్న బొడ్డగూడ, నల్లరాయిగూడ పంచాయతీల పరిధిలోని 12 పీవీటీజీ గిరిజన గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా సోమవారం పట్టణానికి చేరుకుని, తహసీల్దార్ నీలాపు అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. అటవీ హక్కుల చట్టం మేరకు పీవీటీజీలకు మౌలిక వసతుల కల్పనకు అనువుగా వాటిని రెవెన్యూ గ్రామాల పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆకస్మిక తనిఖీ


రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ: మండలంలోని కళ్లికోట, గుణానపురం, విక్రంపురం గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం అక్కడ రోగులకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, ఆరోగ్య తనిఖీలు చేపట్టి, జ్వరపీడితులను గుర్తించి, వైద్యసేవలందించారు. అలాగే ఆరోగ్య ఉప కేంద్రాల్లోని మందుల నిల్వలు, వాటి వినియోగానికి సంబంధించి, స్టాక్ రిజిస్టర్ నమోదు చేయాలని తెలిపారు.

గిరిజన 'స్పందన'కు 24 వినతులు


వినతులు స్వీకరించి, పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి 24 వినతులు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలించిన పీఓ కల్పనాకుమారి ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీతంపేటలో ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న షాపులు అద్దెకు ఇప్పించాలని దేవనాపురానికి చెందిన ఎన్.కాంతారావు వినతిపత్రం సమర్పించగా, బోర్‌వెల్ మంజూరు చేయాలని కడుంసింగికి చెందిన జాను, గ్రావెల్ రోడ్డు వేయాలని బోయిమానుగూడ గిరిజనులు, అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని వడ్డంగిగూడ ఉషారాణి, తాగునీటి సదుపాయం కల్పించాలని రామన్నగూడ, మధ్యగూడ గ్రామాల గిరిజనులు అర్జీలు అందజేశారు. వీటన్నింటినీ పరిశీలించిన అధికారులు వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి స్పందన కార్యక్రమానికి ఉన్నతాధికారులు హాజరు కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదో వచ్చాం, వెళ్లాం అనేలా టైమ్‌పాస్ కోసం రావొద్దని, విధుల నిర్వహణలో చిత్తశుద్ధి, నిబద్ధత కనబరచాలని తెలిపారు. ఇకనుంచి ఏ ఒక్కరూ గైర్హాజరైనా, కార్యక్రమానికి వచ్చి మధ్యలో వెళ్లిపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, పీఏఓ హరికృష్ణ, ఇంజినీరింగ్ డీఈ కృష్ణకుమార్, సీడీపీఓ రంగలక్ష్మి, ఏపీడీలు శ్రీహరి, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక కొండవీధిలో మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కలుగజేస్తాయన్నారు. స్నేహపూరిత వాతావరణంలో చక్కగా ఆడుకుని, క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో దోస్త్ మేరా దోస్త్ సంఘ అధ్యక్షుడు పాలక ప్రేమానంద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన


మనబడి నాడు-నేడు పనులపై ఆరాతీస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

కురుపాం: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సోమవారం పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ హరికృష్ణతో మాట్లాడి, జరుగుతున్న పనులపై ఆరాతీశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, ఆర్ఐ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తికి గాయాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది


కారును ఢీకొన్న బైక్

భామిని: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో పి.ప్రవీణ్ అనే యువకుడికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండలంలోని బాలేరు-అత్తికొత్తూరు ఏబీ రోడ్డులో సోమవారం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న ఆయా వాహనాలు అదుపుతప్పడంతోనే ఒకదానికొకటి ఢీకొన్నట్లు సమాచారం. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు.

కార్మిక లోకం వర్ధిల్లాలి..

శ్రమదోపిడీని నిరసిస్తూ ప్రపంచ కార్మికులకు స్ఫూర్తినిస్తూ ఏటా మే 1వ తేదీన మే డే కార్యక్రమం నిర్వహిస్తారు. సోమవారం పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని, కార్మిక హక్కులు, సంక్షేమంపై గళంవిప్పారు. కార్మిక లోకం జిందాబాద్, శ్రమజీవుడా నీకు సలాం.. అని నినాదాలు చేశారు. సమాజ గతి, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమేనని, పనికి తగ్గ వేతనం, వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యమివ్వడమే మనమిచ్చే నిజమైన గౌరవమన్నారు. అనంతరం ఎర్రజెండా ఆవిష్కరించి, కార్మికుల శ్రేయస్సు కోసం చేసే పోరాటంలో అశువులు బాసిన వారికి ఘనంగా నివాళులర్పించారు.

–పాలకొండ, కురుపాం సాక్షినెట్‌వర్క్


సీతంపేట: మే డే ర్యాలీలో సీఐటీయూ, గిరిజన సంఘ నాయకులు


భామిని మండల కేంద్రంలో చేసిన ర్యాలీలో కార్మిక సంఘాల నేతలు


గుమ్మలక్ష్మీపురం జీసీసీ స్టాక్ పాయింట్ వద్ద ఎర్రజెండా ఆవిష్కరించి, కార్మిక లోకం వర్ధిల్లాలని నినాదాలు చేస్తున్న కార్మికులు



కురుపాం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు


పాలకొండ: కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు రమణారావు


వీరఘట్టంలో జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు


కొమరాడ ప్రధాన రోడ్డులో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు


జియ్యమ్మవలస: ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నేత గంగునాయుడు



గరుగుబిల్లిలో కార్మికుల హక్కులపై మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు